సాక్షి విజయనగరం

సోమవారం ׀ 30 ׀ సెప్టెంబర్ ׀ 2024



నేటితో సరి..!

అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనున్నామనే ప్రభుత్వ ప్రకటనతో మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. - 8లో



విశాఖ ఉక్కును రక్షించుకుందాం

పార్టీలకతీతంగా విశాఖ స్టీల్ కర్మాగారాన్ని సమష్టిగా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జేవీవీ పిలుపునిచ్చింది. - 8లో



జ్వరాల విజృంభణ

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడు స్వర్ణాంధ్ర దార్శనిక పత్రంపై ప్రజాభిప్రాయ సేకరణ

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో రూపొందించనున్న స్వర్ణాంధ్ర – 2047 దార్శనిక పత్రం రూపకల్పనకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ డా. బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి దార్శనిక పత్రాల రూపకల్పన కోసం జిల్లాలోని మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, రైతులు, సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వర్తక వాణిజ్య సంఘాల ప్రతినిధులు తదితరుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

దురాచారాలను రూపుమాపిన 'గురజాడ'

విజయనగరం టౌన్: సమాజాన్ని అప్రతిష్ట పాల్జేసే దురాచారాలను రూపు మాపేందుకు సాహిత్యాన్ని సృష్టించిన గొప్ప వ్యక్తి గురజాడ అప్పారావు అని పలువురు కొనియాడారు. విజయభావన సాహితీ సదస్సు స్థానిక గురజాడ జిల్లా గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన సభా కార్యక్రమానికి ఎంవీఆర్ కృష్ణాజి సభాధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ గురజాడ అడుగుజాడలు నేటికీ ఆదర్శమన్నారు. సమ్మానకర్తగా దామరాజు శంకరం వ్యవహరించారు. అనంతరం వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి రచించిన ఆదిశంకరుల అవతార విశేషాలు కొన్ని లఘుకృతులు అనే గ్రంథాన్ని శంకరమఠం అధ్యక్షుడు నరసింహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఏచూరి

- వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

పార్వతీపురం టౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన వ్యక్తి సీతారాం ఏచూరి అని వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామ్రేడ్ ఏచూరి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చట్ట సభల్లో గొంతెత్తి నినదించడమే కాకుండా తన వాదనా పటిమతో ప్రత్యర్థి పార్టీ నాయకుల మెప్పును పొందిన అనితర సాధ్యుడు, గొప్ప దార్శనికుడు ఏచూరి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, పార్టీ జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి, ఎన్‌వై నాయుడు, రెడ్డి శ్రీదేవి, రెడ్డి ఈశ్వరరావు, బంటు దాసు, కె.రామస్వామి, బొత్స లక్ష్మి, మండంగి రమణ, బి.వెంకటరమణ, డి.రమణారావు, వై.మన్మధరావు, జి.వెంకటరమణ, వి.ఇందిరతో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు సాలూరులో పీజీఆర్ఎస్

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు స్వయంగా రావచ్చునన్నారు. పీజీఆర్ఎస్‌కు అధికారులంతా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రగతి పథంలో జెడ్పీ

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో సత్ఫలితాలు
- మూడేళ్ల పదవీ కాలంలో 923 అభివృద్ధి పనులు
- జెడ్పీ ఆధ్వర్యంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

జిల్లా పరిషత్తు ప్రగతి పథంలో పయనిస్తోంది. ఉమ్మడి విజయనగరం పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆలంబనగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు జెడ్పీ చైర్మన్‌గా మూడేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. ఆయన నేతృత్వంలో జిల్లా పరిషత్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల సద్వినియోగంతో దాదాపు 923 అభివృద్ధి పనులు సాకారమయ్యాయి.

● సమకూరిన మౌలిక వసతులు

గత మూడేళ్ల కాలంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పలు మౌలిక వసతుల పనులకు పెద్దపీట వేశారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ భవనాలు, రహదారుల మరమ్మతులు చేపట్టారు. 461 సాధారణ పనులకు రూ.18.16 కోట్లు మంజూరు చేశారు. గ్రామాల్లో తాగునీటి బోర్లు, కాలువల నిర్మాణానికి రూ.5.12 కోట్లతో 222 పనులు చేపట్టారు. ఎస్సీలకు సంబంధించి రచ్చబండలు, సామాజిక భవనాల మరమ్మతులు, సీసీ రోడ్లు, బోరుబావులకు సంబంధించి 49 పనులకు గాను రూ.1.85 కోట్లు ఖర్చు చేశారు. గిరిజనుల ఆవాసాల్లో సీసీ రోడ్లు, బోరుబావులు, గ్రావెల్ రోడ్లు తదితర 80 పనులకు రూ.1.55 కోట్లు ఇచ్చారు. సుమారు రూ.1.32 కోట్ల వ్యయంతో 30 అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు చేయించారు. ఇతర ప్రభుత్వ శాఖల పరిధిలో 65 అభివృద్ధి కార్యక్రమాలకు రూ.91 లక్షల వరకూ మంజూరు చేశారు.

● నిధుల సద్వినియోగం

స్థానిక సంస్థలకు ప్రధాన ఆర్థిక వనరు ఆర్థిక సంఘం నిధులే. అదీ ఏడాదికి రూ.16 కోట్లు చొప్పున మాత్రమే విడుదలవుతున్నాయి. ఇలా వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.68.84 కోట్లు చక్కని ప్రణాళికతో సద్వినియోగం చేశారు. ఇప్పటివరకూ రూ.66 కోట్ల వరకూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో 33 సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) స్కీముల నిర్వహణకు ఖర్చు చేశారు.

● పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు

ఉమ్మడి విజయనగరం జిల్లాల్లోని పలు పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు జెడ్పీ నుంచి నిధులు మంజూరు చేశారు. ఆర్‌వో ప్లాంట్లు, ఇన్వెర్టరు బ్యాటరీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు సమకూర్చారు. జెడ్పీ నిర్వహణలో 237 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలోని 107 ప్యానల్ పాఠశాలల్లో నాన్‌టీచింగ్ స్టాఫ్ పోస్టులన్నీ మంజూరు చేశారు. జూనియరు అసిస్టెంట్ లేదా రికార్డు అసిస్టెంట్ రెండు పోస్టులు మంజూరైన ఈ పాఠశాలల నుంచి ఒకరు చొప్పున 130 నాన్ ప్యానల్ పాఠశాలల్లో డ్రాఫ్టెడ్ టు వర్క్ విధానంలో నియమించారు. దీనివల్ల ఉపాధ్యాయులు పూర్తి సమయాన్ని సబ్జెక్టుల బోధనకు వినియోగిస్తున్నారు. మెరిట్ సాధించిన 52 మంది విద్యార్థులకు రూ.5.16 లక్షలతో ట్యాబ్స్ కొనుగోలు చేసి ఇచ్చారు. అంతేకాదు వయోజన విద్య ప్రోత్సాహకంగా చిట్టి గురువులు కార్యక్రమ నిర్వహణకు రూ.9 లక్షలు మంజూరు చేశారు.

● కారుణ్య నియామకాల జోరు

జెడ్పీ కారుణ్య నియామకాలను సకాలంలో చేపట్టారు. 65 మందికి కార్యాలయ సహాయకులుగా, 29 మందికి టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగం కల్పించారు. పదోన్నతులు కూడా గత మూడేళ్లలో 80 మందికి లభించాయి.


> **● ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం**
>
> గత మూడేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పని చేశాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంచి సహకారం లభించింది. జెడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఉప ముఖ్యమంత్రులు పీడిక రాజన్నదొర, పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరికీ కృతజ్ఞతలు. గత ఎన్నికల్లో అనూహ్యంగా ఓటమి ఎదురైనప్పటికీ నాటి ప్రాధాన్య అంశాలను కొనసాగిస్తాం. కూటమి ప్రభుత్వంలో కూడా స్థానిక సంస్థలకు తగిన సహకారం, నిధులు లభిస్తాయని భావిస్తున్నాం. ఈ ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలకూ జెడ్పీ నుంచి పూర్తి సహకారం అందిస్తాం. ప్రజాభిప్రాయానికి భిన్నంగా పని చేస్తే కచ్చితంగా ప్రజల తరఫున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.
>
> – మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్

● పెద్దమనసుతో చైర్మన్ చేయూత

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గత మూడేళ్లలో అనేక మందికి ఆర్థిక సాయం మంజూరు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 15 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం సుమారు రూ.7.30 లక్షలు ఇచ్చారు. మెరకముడిదాం మండలంలోని సోమలింగాపురం గ్రామానికి చెందిన సారాపెంట సరస్వతికి క్యాన్సర్ చికిత్సకు సహాయంగా రూ.50 వేలు, మరో క్యాన్సర్ బాధితుడు ఎస్.గణపతి (జి.మర్రివలస)కి రూ.25 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు అట్టాడ రవితేజ (జొన్నవలస)కు రూ.65 వేలు, మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటకు చెందిన నక్కల అప్పన్నకు రూ.40 వేలు మంజూరు చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాలకొండ మండలం అర్తం గ్రామానికి చెందిన బొట్టా రాజ్‌కుమార్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు, వైద్య ఖర్చుల కోసం మన్నేపూరి ఉమామహేశ్వరరావు (వెదుళ్లవలస)కు రూ.50 వేలు, బి.బిద్యాక్షరి (ఎస్.కోట)కి రూ.50 వేలు, ఎం.శంకర్రావు (పల్లి గంగ్రేడు)కు రూ.50 వేలు జెడ్పీ ఆగంతక నిధుల నుంచి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంజూరు చేశారు.



గుండె వ్యాధితో బాధపడుతున్న హోంగార్డు బి.అచ్చయ్యమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40వేలు జెడ్పీ నిధుల నుండి మంజూరు చేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మలేషియాలో ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ - 2024 పోటీల్లో పాల్గొనేందుకు కిల్లంపాలెంకు చెందిన జుత్తాడ జగదీష్‌కు రూ.75వేలు మంజూరు చేసిన జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

● క్రీడాకారులకు ప్రోత్సాహం

ఇటీవలే గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన టెన్నికాయిట్ క్రీడాకారిణి రెడ్డి మౌనిక దక్షిణాఫ్రికాలో జరిగిన పోటీల్లో పాల్గొనడానికి అవసరమైన ప్రయాణ, వసతి ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయం జెడ్పీ నుంచి అందింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రతిభ ఉన్న ఏ ఒక్క క్రీడాకారుడు నిరాశ పడకూడదనే ఉద్దేశంతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జిల్లాలో పలువురికి ఆర్థిక సహాయం అందించారు. విజయనగరంలోని తోటపాలేనికి చెందిన చందక వెంకట్ పవన్ కార్తికేయ అర్జెంటీనాలో వరల్డ్ స్కేటింగ్ పోటీలకు వెళ్లేందుకు ఖర్చుల కోసం రూ.2.65 లక్షలు మంజూరు చేశారు. ప్రపంచ స్థాయిలో విజయనగరం పేరు నిలబెట్టిన నెల్లిమర్ల మండలం చంద్రంపేట గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ శనాపతి గురునాయుడికి రూ.లక్ష బహుమతి అందించారు. దివ్యాంగుల క్రికెట్‌లో ఆడటానికి అవసరమైన కిట్‌ను రూ.46 వేలతో కొనుగోలు చేసి నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామానికి చెందిన గణేష్‌కు ఇచ్చారు. జిల్లాలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులకు వసతి, భోజనం సదుపాయాలకు రూ.5 లక్షలు మంజూరు చేశారు.

● బాధితులకు చేయూత



పెదపెంకి గ్రామానికి చెందిన అలజంగి వెంకటేశ్వరరావు, గంగన్నపాడు గ్రామానికి చెందిన చీమల చంద్రశేఖరరావుకు మూడు చక్రాల స్కూటీలను రూ.2,19,648లతో కొనుగోలు చేసి పంపిణీ చేసిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుతో మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, శంబంగి వెంకటచినప్పలనాయుడు

బొబ్బిలి మండలం పారాదిలో అగ్ని ప్రమాదంలో పూరిళ్లు కాలిపోయిన వారికి రూ.1.46 లక్షల వ్యయంతో సిమెంట్ రేకులు జెడ్పీ ద్వారా అందించారు. ఐదుగురు దివ్యాంగులకు రూ.5.30 లక్షల వ్యయంతో మూడు చక్రాల స్కూటర్లను సమకూర్చారు. జిల్లాలోని సుమారు 1336 మంది గొర్రెల కాపర్లకు రూ.36.57 లక్షల వ్యయంతో రెయిన్ కోట్స్, టార్చ్ లైట్లు, మత్స్యకారులకు వలలు అందించారు.

మూడేళ్లలో అభివృద్ధి పనులు ఇలా....

పద్దు వివరాలు	మంజూరైన పనులు	మంజూరుచేసిన మొత్తం (రూ.లక్షల్లో..)
23 శాతం నిధుల కేటాయింపుతో చేపట్టిన పనులు	461	1816.45
12 శాతం నిధుల కేటాయింపుతో తాగునీటి పనులు	222	512.08
6 శాతం నిధులతో ఎస్టీ సంక్షేమ పనులు	80	155.68
15 శాతం నిధులతో ఎస్సీ సంక్షేమ పనులు	49	185.37
15 శాతం నిధులతో స్త్రీ, శిశు సంక్షేమానికి పనులు	30	132.62
10 శాతం నిధులతో ఇతర శాఖలతో సమన్వయ పనులు	65	90.98
4 శాతం నిధులతో క్రీడల ప్రోత్సాహకం,పండగల నిర్వహణ	16	53.29
మొత్తం	923	రూ.2946.47 లక్షలు

రాములోరికి వైభవంగా 'పవిత్ర సమర్పణ'



పట్టు పవిత్రాలను ఊరేగిస్తున్న వేద రుత్విక్కులు, అర్చకస్వాములు

- శ్రీరంగం నుంచి తెచ్చిన పట్టు పవిత్రాలతో ఊరేగింపు
- సంప్రదాయబద్ధంగా అష్ట కలశ ఆరాధన
- యాగశాలలో నేడు పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో రామస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత ఉత్సవమూర్తుల వద్ద విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అష్టకలశ ఆరాధన, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీరామచంద్ర స్వామికి వివిధ నదీ జలాలతో పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో ప్రాయశ్చిత్త హోమాలు చేపట్టి శ్రీరంగం నుంచి తీసుకొచ్చిన పట్టుదారాలతో తయారైన పవిత్రాలతో ప్రదక్షిణలు చేశారు. పట్టు పవిత్రాలను గర్భాలయంలోకి తీసుకువచ్చి శ్రీరామచంద్ర స్వామి ధృవమూర్తులకు అలంకరించారు. తరువాత స్వామికి మహానివేదన, మంగళశాసనం కార్యక్రమాలను వైదిక సిబ్బంది జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద రుత్విక్కులు స్వామి సన్నిధిలో పారాయణాలు, యాగశాలలో హోమాలు నిర్వహించారు. సోమవారం పారాయణాలు, జపములు, హవములు పూర్తి చేసి పవిత్ర విసర్జన, యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తామని అర్చకస్వాములు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, పవన్, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'పైడితల్లి' పండగకు ప్రత్యేక రైళ్లు నడపాలి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి పండగను రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి పండగకు విశాఖ, విజయనగరం, రాయగడ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడిపే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఈస్ట్‌కోస్ట్ రైల్వే డీఆర్ఎంకు లిఖితపూర్వకంగా కోరారు. అక్టోబరు 14 నుంచి 16 వరకూ పండగ నేపథ్యంలో ఉత్తరాంధ్ర నుంచి అత్యధికంగా వచ్చే భక్తులకు ప్రత్యేక రైళ్లు వేయాలని విన్నవించారు. విశాఖపట్టణం, విజయనగరం, పలాస, రాయగడ వరకూ రైళ్లు నడపాలన్నారు.

'జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్'తో..

గిరిజన ప్రాంతాల అభివృద్ధి

- అక్టోబరు 2న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- కలెక్టర్ డా. బీఆర్ అంబేడ్కర్ వెల్లడి

విజయనగరం అర్బన్: గిరిజన తెగల వారు నివసించే ప్రాంతాల్లో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా మౌలిక వసతులను కల్పించేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబరు 2న వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ డా. బీఆర్ అంబేడ్కర్ వెల్లడించారు. ఆదిమ గిరిజన తెగల వారు నివసించే దేశంలోని 100 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, అందులో విజయనగరం జిల్లా కూడా వున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలోని ఎస్.కోట, గంట్యాడ, బాడంగి, బొబ్బిలి, బొండపల్లి, గజపతినగరం, గరివిడి, జామి, తెర్లాం, వేపాడ, మెంటాడ తదితర 11 మండలాల్లో గిరిజనులు నివసించే గ్రామాల్లో ఈ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం వుందన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియం నుంచి జిల్లాకు చెందిన గిరిజనులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రధానమంత్రి నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా గిరిజనులకు సేవలందిస్తున్న పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి

- త్వరలో కబడ్డీ, ఖోఖో అకాడమి
- అమ్మవారి పండుగకు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభం
- జిల్లాలో పర్యటించిన శాప్ ఎండీ గిరీశ

విజయనగరం: జిల్లాలో త్వరలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని శాప్ ఎండీ గిరీశ పీఎస్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి తరలించిన స్పోర్ట్స్ స్కూల్‌ను జిల్లాలో తిరిగి ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఖోఖో, కబడ్డీ అకాడమీని కూడా ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావును ఆదేశించారు. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఎండీ గిరీశ ఆదివారం జిల్లాలో పర్యటించారు. విజ్జి స్టేడియంలో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూ.10 లక్షలు మంజూరు చేయగా.. ఆ నిధులతో పనులు దాదాపు పూర్తయినట్లు పేర్కొన్నారు. దీంతో ఈ స్టేడియంను అమ్మవారి పండగ నాటికి ప్రారంభించాలని, అక్టోబరు 10లోగా స్టేడియంను అప్పగించాలని శాప్ ఇంజినీర్లను ఎండీ ఆదేశించారు. స్టేడియంలోని బాక్సింగ్ రింగ్‌కు అవసరమైన పరికరాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో విశాఖ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాలియట్, సీపీడబ్ల్యూ ఇంజినీర్ శ్రీనివాస్, శాప్ ఇంజినీర్లు, పలువురు కోచ్‌లు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజ్జి స్టేడియంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న శాప్ ఎండీ గిరీశ

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న శాప్ ఎండీ

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీపైడితల్లి అమ్మవారిని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీశ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనగరం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు దేవస్థానం తరఫున వేద పండితులు ఆశీర్వదించి శ్రీ పైడితల్లి అమ్మవారి ప్రసాదాలు, ఫొటో అందజేశారు. అంతకు ముందు ఎండీ గిరీశకు జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ జిల్లా పరిషత్ అతిథి గృహంలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



పైడితల్లమ్మవారి చిత్రపటాన్ని, శాప్ ఎండీకి అందజేస్తున్న ఆలయ అర్చకులు

సమస్యలు పరిష్కరించకుంటే

పోరుబాట

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: మున్సిపల్ ఉపాధ్యాయులకు పాఠశాల విద్యా శాఖ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెడ్పీ హాల్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ ఖాతాలో ఉన్న పీఎఫ్ డ్రా చేసుకునేటువంటి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు తీర్చకపోతే దశలవారీగా పోరుబాట కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహనరావు, సంపతిరావు కిశోర్ కుమార్, వి.శ్రీలక్ష్మి, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించాలి

- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

తెర్లాం: వచ్చే నెల 5,6,7 తేదీల్లో విశాఖపట్నం జిల్లా నునపర్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారులంతా బాగా రాణించాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు తెర్లాం మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా బాలుర, బాలికల జట్ల ఎంపికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులంతా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జి.సుందరరావు, అసోసియేషన్ సభ్యులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొననున్న బాల,బాలికల జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–14,17,19 వయస్సుల విభాగాల్లో ఎంపికలు నిర్వహించగా..జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 60మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, పీడీలు కేవీఎస్ రాజు, బంగార్రాజు, జి.ధర్మారావు, డి.ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావులు పర్యవేక్షించారు.

6న ఉత్తరాంధ్ర కోలాట ప్రదర్శన పోటీలు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర స్థాయి కోలాట ప్రదర్శన పోటీలను అక్టోబర్ 6న నిర్వహిస్తున్నట్లు శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియం ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాల రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆడిటోరియంలో కళాకారులతో కలిసి మాట్లాడుతూ జాతీయ కోలాట దినోత్సవమైన అక్టోబర్ 4న నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఉత్తరాంధ్రలోని కళాకారులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. బొబ్బిలి కళాకారుల సమాఖ్య సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్న ప్రాచీన సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలో ఉత్తరాంధ్రలోని జిల్లాల కళాకారులు పాల్గొనవచ్చన్నారు. మొదటి ఆరుస్థానాలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7799808286 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.విజయమోహన్, జి.కరుణ కుమార్, బీజీ గంగాధర్, మీసాల గౌరునాయుడు, చప్ప అప్పలనాయుడు, టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్ర్

పర్లాకిమిడి: బీటెక్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, తద్వారా ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్ర్ అన్నారు. ఆదివారం సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంచూరియన్ వర్సిటీలో స్మార్ట్ వ్యవసాయం, పశువైద్యం, ఫార్మసీ, నర్సింగ్, ఇంజినీరింగ్‌తో పాటు మరికొన్ని కోర్సులు ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ప్రజ్ఞాపాణి, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢి, మనోజ్‌కుమార్ బిశ్వాల్, జనరల్ మేనేజర్ ఫాల్గుణరావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹218

నేటితో సరి..!

- ముగియనున్న ప్రభుత్వ మద్యం షాపులు
- ఆందోళనలో ఉద్యోగులు

జిల్లాలో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు	
సూపర్‌వైజర్లు	53 మంది
సేల్స్‌మెన్	159 మంది
వాచ్‌మెన్	48 మంది

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్థానికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో నూతన మద్యం పాలసీలో భాగంగా కొందరికి ఉద్యోగాలు కల్పించారు. అయితే ఆ ఉద్యోగాలకు ప్రస్తుత ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనున్నామనే ప్రకటనతో మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు గత ప్రభుత్వం ఉద్యోగులను నియమించి ప్రభుత్వం పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించింది. సూపర్‌వైజర్, సేల్స్‌మన్, నైట్ వాచ్‌మన్ ఉద్యోగాలు ఇచ్చింది. ఒక్కో షాపులో నలుగురి నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండడంతో తమ భవిష్యత్ ఏమిటోనని వారు దిగులు చెందుతున్నారు.



పార్వతీపురం పట్టణంలో మద్యం అమ్మకాలు చేపడుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారికి కాంట్రాక్ట్ ఉద్యోగ భద్రత కల్పించాలి. 5 సంవత్సరాలుగా పని చేస్తున్న మా పై ప్రభుత్వం వేటు వేయాలన్న ఆలోచన విరమించుకోవాలి. మమ్మల్ని కొనసాగిస్తున్నట్లు లిఖిత పూర్వకంగా తెలియజేయాలి. లేకుంటే అక్టోబరు 1 నుంచి నిరసన తెలుపుతాం.

– అప్పలస్వామి సూపర్‌వైజర్, పార్వతీపురం

ఆ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. 5 సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగానికి భద్రత కల్పించాలి. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రేపటి నుంచి నిరసన తెలుపుతాం

–రామ్మోహన్, సెల్స్‌మన్, పార్వతీపురం

కుటుంబాలు రోడ్డున పడతాయి



ప్రభుత్వ నిర్ణయం వల్ల మా కుటుంబాలు రోడ్డున పడతాయి. మాలాంటి చిరుద్యోగులకు కూటమి ప్రభుత్వ భరోసా కల్పించాలి. ప్రైవేట్ దుకాణాల్లో మమ్మల్నే కొనసాగించేలా చర్యలు చేపట్టాలి. ఈ అంశంపై ప్రభుత్వం లిఖిత పూర్వకంగా సమాధానం చెప్పాలి. లేందంటే నిరసన తెలియజేస్తాం.

– సూరేష్, సెల్స్‌మన్, పార్వతీపురం

గంజాయి కేసుల్లో పట్టుబడితే జీవితాలు అస్తవ్యస్తం

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: గంజాయి కేసుల్లో పట్టుబడితే ప్రస్తుతం అమలులో ఉన్న కఠిన చట్టాలతో జీవితాలు నాశనమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుతం గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు కఠినచర్యలు చేపడుతూ, చట్టాలను కూడా కఠినతరం చేశారన్న విషయాన్ని యువత గుర్తించాలని పిలుపునిచ్చారు. గంజాయి కేసుల్లో ఎక్కువగా యువతే పట్టుబడుతూ, జైళ్లలో మగ్గుతున్నారన్నారు. గంజాయి కేసుల్లో న్యాయస్థానాలు కూడా వెంటనే బెయిల్ మంజూరు చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలు, స్నేహాలకు అలవాటు పడి, వారి అవసరాలను తీర్చుకునేందుకు అక్రమదారుల్లో ప్రయాణిస్తూ, జైలుపాలవుతున్నారని అభిప్రాయ పడ్డారు. కావున, యువత తమ చెడు అలవాట్లకు స్వస్తి పలికి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. గంజాయి వ్యాపారుల ప్రలోభాలకు లొంగవద్దని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు.



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



పిల్లలతో జ్యోతి, రాము (ఫైల్)

పాచిపెంట: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆ గిరిజన జంట ముగ్గురు పిల్లలతో సంతోషంగా ఉన్నారు. అయితే మద్యం మహమ్మారి ప్రవేశించి వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. అప్పుడప్పుడు మద్యాన్ని తాగే భర్త ఆ సమయంలో భార్యతో గొడవపడేవాడు. భార్యాభర్తల మధ్య గొడవలు తరచూ అవుతున్న నేపథ్యంలో భర్త తీరుపై మనస్తాపానికి గురైన ఓగిరిజన వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పాచిపెంట మండలంలోని పద్మాపురం గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుంబి రాము శనివారం పూటుగా మద్యం తాగి భార్య జ్యోతితో గొడవపడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన జ్యోతి శనివారం అర్ధరాత్రి వంటింట్లో ఉరివేసుకుంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో భర్తకు మెలకువ వచ్చి వంటగదివైపు వెళ్తుండగా ఆత్మహత్యకు పాల్పడిన భార్యను చూసి వెంటనే స్థానికులకు తెలియజేశాడు. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. వారికి ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.

మితిమీరిన వేగంతో ప్రమాదం

- రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మితిమీరిన వేగం రెండు నిండు ప్రాణాలు బలి తీసుకోగా..మరో ఇద్దరిని ఆస్పత్రి పాలు చేసింది. కురుపాం మండలంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలంలోని ఆగంగూడ గ్రామానికి చెందిన బిడ్డిక జుజారి (45) తన భార్య ఇమరితో కలిసి ద్విచక్ర వాహనంపై దుంబిడి గ్రామంలో చర్చికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఆవిరిమానుగూడ గ్రామానికి చెందిన బిడ్డిక శ్రీను(22) తన బంధువైన శ్రీధర్‌తో పాటు ద్విచక్రవాహనంతో తిత్తిరి నుంచి వస్తున్నాడు. మితిమీరిన వేగంతో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు బల్లేరుగూడ జంక్షన్ వద్ద ఢీకొన్నాయి. దీంతో జుజారి, శ్రీనులు అక్కడికక్కడే మృతిచెందారు. ఆ వాహనాలపై వెనుక కూర్చున్న జుజారి భార్య ఇమరితో పాటు శ్రీధర్‌కు గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మొండెంఖల్లు పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం తరలించారు. ఇమరికి తీవ్రంగా గాయాలవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహారాజా ఆస్పత్రికి రిఫర్ చేశారు. శ్రీధర్ మొండెంఖల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



ప్రమాదంలో మృతి చెందిన బిడ్డిక జుజారి



బిడ్డిక శ్రీను

జ్వరాల విజృంభణ

- జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.70 లక్షల కేసులు
- వైద్యసిబ్బంది సర్వేలో 19 వేలమంది జ్వర పీడితులు
- 552 మలేరియా కేసులు, డెంగీ కేసులు 142 నమోదు
- జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. గిరిశిఖర ప్రాంతాల్లో వైరల్ జ్వరాలతో పాటు, మలేరియా జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఆస్పత్రికి వెళ్లడానికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఇంటి వద్దే ముక్కుతూ మూలుగుతూ గడుపుతున్నారు. జ్వరపీడితులతో ప్రభుత్వ , ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు కూడా అధికసంఖ్యలో జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో రోగులు వస్తున్నారు. ఆస్పత్రులకు జ్వరాలతో వస్తున్న వారిలో కొతమంది ఇన్‌పేషెంట్లుగా చేరుతుండగా మరి కొంతమంది ఔట్‌పేషెంట్లుగా చికిత్స తీసుకుని ఇంటికి వెళ్తున్నారు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారు పీహెచ్‌సీలకు వెళ్తున్నారు. తీవ్రమైన జ్వరం, ఉన్న వారు ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్తున్నారు. వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా కేసులు కూడా ఈఏడాది ఎక్కువగానే నమోదయ్యాయి.

ప్రతి పల్లెలోను జ్వరపీడితులు :

జిల్లాలో ప్రతి పల్లెలోను ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారిన పడుతున్నారు . మరి కొన్ని ఇళ్లలో ఇంటిల్లిపాది జ్వరాలతో బాధ పడుతున్నారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న జ్వరాలు గతంలో కంటే భిన్నంగా ఉంటున్నాయి. ఒకటి రెండు రోజులకు జ్వరం తగ్గిపోయినప్పటికీ నీరసం, దగ్గు వంటివి వారం, 10 రోజుల వరకు తగ్గడం లేదు. దీంతో జ్వరం వచ్చిందంటే చాలు ఇంటి నుంచి కదల్లేని పరిస్థితి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఫిమేల్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

అధికంగా మలేరియా, డెంగీ కేసులు

జిల్లాలో జనవరి నుంచి సెప్టెంబర్ 27 నాటికి జిల్లాలో 142 డెంగీ, 552మలేరియా కేసులు నమోదయ్యాయి. వైరల్ జ్వరాల కేసులుసుమారు 2.70 లక్షలు నమోదయ్యాయి.

కొత్త లక్షణాలతో జ్వరాలు

ప్రస్తుతం విషజ్వరాలు కొత్త లక్షణాలతో వ్యాప్తి చెందుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, వికారం, ఆకలి మందగించడం, కాళ్ల నొప్పులతో బాధిస్తున్నాయి.



రోగులతో కిటకిటలాడుతున్న ఓపీ విభాగాలు

ఇంటింటి సర్వేలో 19 వేలమంది పీడితుల గుర్తింపు

సెప్టెంబర్ నెలలో వైద్య సిబ్బంది జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించగా ఈ సర్వేలో 19 వేల మందిని జ్వరపీడితులుగా గుర్తించారు.

వైద్య పరీక్షల కోసం క్యూ కడుతున్న జనం

జ్వరాలు రోజులు తరబడి తగ్గకపోవడంతో వైద్య పరీక్షల కోసం ల్యాబొరేటరీలకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ల్యాబొరేటరీలతో పాటు ప్రైవేట్ ల్యాబొరేటరీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ల్యాబొరేటరీకి రోజుకి 50 నుంచి 100 మంది వరకు జ్వర పీడితులు వస్తున్నారు. నగరంలో 50 వరకు ప్రైవేట్ ల్యాబొరేటరీలు ఉన్నాయి. వాటికి రోజుకు 1500మంది నుంచి 2500 మంది వరకు జ్వర పీడితులు వైద్య పరీక్షల కోసం వెళ్తున్నారు.



ల్యాబొరేటరీ వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రోగులు

చర్యలు తీసుకుంటున్నాం

జ్వరాల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటి ఫీవర్ సర్వే చేశాం. సెప్టెంబర్ మొదటి వారంలో రోజుకు 1300 వరకు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రోజుకు 500 నుంచి 600 వరకు కేసులు నమోదవుతున్నాయి.ప్రస్తుతం జ్వరాల వ్యాప్తి తగ్గింది.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

విశాఖ ఉక్కును సమష్టిగా రక్షించుకుందాం



పోస్టర్ విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ

విజయనగరం అర్బన్: భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలకతీతంగా విశాఖ స్టీల్ కర్మాగారాన్ని సమష్టిగా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్.కృష్ణాజీ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున విశాఖలో చేపట్టే నిరసన ర్యాలీకి జిల్లా ప్రజలంతా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉత్తరాంధ్ర ప్రజల సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ ఎంతోమంది త్యాగమూర్తుల బలి దానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ఉత్తరాంధ్రలో లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ దేశానికి తలమానికంగా ఉందన్నారు. ఇంతటి మహోన్నతమైన స్టీల్ ప్లాంట్‌ను నిర్దాక్షిణ్యంగా మన ప్రభుత్వాలు అమ్మకానికి పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర బీసీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నీల తిలక్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వేల కోట్ల రూపాయలు ఆదాయాన్ని ఇచ్చిన విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్ర నిరుద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఎస్.హేమంత్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు లాభాలు తెచ్చిపెట్టే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం దుర్మార్గమని మండపడ్డారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గొర్లె సూరిబాబు మాట్లాడుతూ దేశంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలను లేకుండా చేయడమే లక్ష్యంగా విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

జిల్లా ప్రజలంతా తరలి రావాలి

ఉత్తరాంధ్ర ప్రజల సంస్థ జిల్లా కన్వీనర్ డాక్టర్ రమేష్ రాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఎలుగెత్తి చాటాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని, విశాఖ ఉక్కు రక్షణ కోసం గాంధీ జయంతి రోజు విశాఖ డాబా గార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి చేపట్టే నిరసన ర్యాలీ కార్యక్రమంలో జిల్లా నుంచి ప్రజలంతా అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశ్వమానవ సమాజం ప్రధాన కార్యదర్శి ఎం.డి నయీమ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్‌ఏ) సభ్యులు, న్యాయవాది గేదెల సత్యం, సీనియర్ న్యాయవాది గుండుపల్లి సతీష్, గొంప ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం

- జ్యుడిషియల్ కస్టడీకి నిందితుడి తరలింపు

మెంటాడ: మండలంలోని చింతలవలసలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్సై కె.సీతారాం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో ఓ వ్యక్తి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 20 మద్యం సీసాలతో నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.



మెంటాడ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

21 మద్యం సీసాలు స్వాధీనం

గుర్ల: మండల కేంద్రంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను గుర్ల పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఆమె నుంచి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం అమ్మకాలు జరుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ఆకట్టుకుంటున్న భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్

రెండవ రోజు కొనసాగిన నాటక, నృత్య పోటీలు

విజయనగరం పూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతిలో జరుగుతున్న భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ రెండో రోజుకు చేరుకుంది. రెండవ రోజు మొదటిగా మెగా సైన్స్ డెమో నిర్వహించారు. ఇందులో భాగంగా 50 రకాల విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన మెగా మ్యాజిక్ షోలో ప్రముఖ మెజీషియన్ చంద్రయ్య చేసిన అనేక రకాల మ్యాజిక్ అంశాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. మ్యాజిక్ షోలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ఏది జరిగినా దానికి ముఖ్య కారణం సైన్స్ మాత్రమే అని, మనం చేసే ప్రతి గారడీ వెనుక ఏదో ఒక సైన్స్ ఉంటుందని దానిని విద్యార్థులు అందరూ గ్రహించాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి రామ్మోహన్ రావు మాట్లాడుతూ రెండవ రోజు కూడా వేలాదిగా విద్యార్థులు విచ్చేసి భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను జయప్రదం చేయడం ఆనందకరమైన విషయమన్నారు. ఈ ప్రదర్శనలు మూడవ రోజు కూడా కొనసాగుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 300 మంది వలంటీర్లు ఈ భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ జయప్రదానికి విచ్చేసి సేవలందిస్తున్నారని అదేవిధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రజానీకం ప్రతిరోజు విచ్చేసి జయప్రదం చేస్తున్నారని సంతోషం వెలిబుచ్చారు. అనంతరం పలు కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్యప్రదర్శనలు